RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.


9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 47 సోమవారం 29 - 09 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

## నాకు పదేళ్ల సమయం ఇవ్వండి

# న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా

- పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరం నిర్మిస్తానని సీఎం రేవంత్ రెడ్డి ధీమా
- రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి సీఎం రేవంత్ శంకుస్థాపన శంకుస్థాపన
- సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్
- కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఎఫ్‌సీడీఏ భవనానికి శంకుస్థాపన
- ఫ్యూచర్ సిటీపై కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం ముఖ్యమంత్రి రేవంత్ వ్యక్తం చేశారు
- ప్రాజెక్ట్‌పై వస్తున్న విమర్శలను ఖండించిన ముఖ్యమంత్రి
- ఇది తన వ్యక్తిగత ఆస్తుల కోసం కాదని, భవిష్యత్ తరాల కోసమేనని స్పష్టీకరణ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ కార్యాచరణకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. 15 వేల చదరపు అడుగుల్లో రూ.20 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నాలుగు నెలల్లో ఈ నిర్మాణం పూర్తి కానుంది.అనంతరం ఫ్యూచర్ సిటీలో జరిగే అభివృద్ధి పనులు, పరిశ్రమలు, లే అవుట్లలకు ఎఫ్‌సీడీఏ అధికారులు అనుమతులు ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారు. రావిర్యాల-ఆమన్‌గల్ గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1కు సీఎం భూమి పూజ చేశారు.

**నాకు పదేళ్ల సమయం ఇవ్వండి, న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీపై కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు ఇక్కడ భూములు ఉన్నందువల్లే ఫ్యూచర్ సిటీ కడుతున్నానని అంటున్నారని ధ్వజమెత్తారు. నా కోసం కాదు భవిష్యత్తు తరాల కోసం ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టామని స్పష్టం చేశారు. చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించారని, అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయని గుర్తు చేశారు. మన భవిష్యత్తుకు ప్రణాళికలు మనమే రచించుకోవాలని - మిగతా 2 లో

# తెలంగాణ గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల

- టీజీపీఎస్సీ గ్రూప్-2 ఫైనల్ ఫలితాలు శనివారం విడుదల
- మొత్తం 783 ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 5.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా తుది జాబితా ప్రకటన
- దసరా పండుగలోపే నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు
- పరీక్షల తర్వాత 10 నెలల్లోనే ఫలితాలు ఇచ్చామన్న టీజీపీఎస్సీ చైర్మన్
- అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న మెరిట్ జాబితా

తెలంగాణలో గ్రూప్-2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించిన 783 గ్రూప్-2 పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నేడు ప్రకటించింది. ఇందులో ఒక పోస్టు భర్తీ కాలేదు.టీజీపీఎస్సీ తాజా ప్రకటనతో ఎంపికైన అభ్యర్థుల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది.2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన రాత పరీక్షలకు - మిగతా 2 లో

## శాంతించిన మూసీ..ఎంజీబీఎస్‌లో బురద తొలగింపు పనులు వేగవంతం



- మూసీ నదికి తగ్గిన వరద ఉద్ధృతి
- ఎంజీబీఎస్‌లో భారీగా పేరుకుపోయిన బురద
- శుభ్రపరిచే పనుల్లో నిమగ్నమైన ఆర్టీసీ సిబ్బంది
- మధ్యాహ్నం నుంచి బస్సులకు అనుమతి లభించే అవకాశం
- ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి కొనసాగుతున్న బస్సు సర్వీసులు
- పికప్ పాయింట్లకు వెళ్లాలని ప్రయాణికులకు అధికారుల సూచన

హైదరాబాద్ నగరానికి ఊరట లభించింది. మూసీ నదికి వరద ఉద్ధృతి తగ్గడంతో నగరంలోని కీలకమైన మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. వరద నీరు వెనక్కి వెళ్లినప్పటికీ, - మిగతా 2 లో

## 2027 నాటికి దేశంలోనే నెంబర్ వన్ టూరిజం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతాం



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం
- హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్, అధికారులు
- సహజసిద్ధ వనరులు, ప్రకృతి సౌందర్యం, వైవిధ్యమైన సంస్కృతి, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల మేళవింపుతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకులకు ఓ స్వర్గధామంగా నిలవగలదని, దీనికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు

ప్రజల్లో పెరుగుతున్న ఒత్తిళ్లు, మానసిక ఆందోళనలకు ఉపశమనం ఇచ్చేది పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక కేంద్రాలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మూడు నెలలపాటు బాగా కష్టపడిన వ్యక్తులు ఓ వారం లేదా పది రోజులు విశ్రాంతి కోసం విదేశాల్లోని పర్యాటక ప్రదేశాలకు వెళ్తారని, - మిగతా 2 లో




## తొక్కిసలాట ఘటనపై హైకోర్టుకు టీవీకే

- 40కు చేరిన మృతుల సంఖ్య
- కరూర్ తొక్కిసలాట ఘటనపై హైకోర్టును ఆశ్రయించిన టీవీకే పార్టీ
- విజయ్ ఇంటి వద్ద భారీ భద్రత
- ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరనున్నట్లు టీవీకే న్యాయవాది ఎస్ అరివళగన్ చెప్పారు
- సోమవారం (సెప్టెంబర్ 29) మధ్యాహ్నం 2:15 గంటలకు హైకోర్టులోని మధురై బెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని తెలిపారు

# ప్రజలకు నాయకులు కార్యకర్తలు దగ్గరగా ఉండాలి

- మంచి-చెడులు వివరించాలి - ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్తానంటే ప్రజలు హర్షించరన్న సీఎం
- జీఎస్టీ ఉత్సవ్ నిర్వహణపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలకు సూచనలు
- రాష్ట్రానికి ఆదాయం తగ్గినా ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ది చేకూరుతుందని వ్యాఖ్య
- కేంద్రం తీసుకొచ్చిన ఈ మార్పులను ఈ మార్పులను ప్రజలకు వివరించాలని క్యాడర్కు దిశానిర్దేశం
- రానున్న కాలంలో ప్రజలపై 1000 కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు



కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా విద్యుత్ కొనుగోళ్లల్లో దాదాపు 1000 కోట్ల రూపాయలు ఆదా చేసినందున, ఆ మేరకు రానున్న కాలంలో ప్రజలపై 1000 కోట్ల భారాన్ని తగ్గిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖను సంక్షోభంలోకి నెట్టేసిందని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అసమర్థ విధానాల వల్ల ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో భారం పడిందని మండిపడ్డారు.15 నెలల కాలంలో విద్యుత్ - మిగతా 2 లో

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- తీవ్ర జ్వరంతో బాధపడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- హైదరాబాద్‌లోని నివాసానికి వెళ్లి పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం
- పవన్‌కు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యుల సూచన
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. గత కొద్ది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న పవన్‌ను ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.గత ఐదు రోజులుగా పవన్ కల్యాణ్ వైరల్ జ్వరంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. - మిగతా 2 లో

# సంపాదకీయం

## కాకతీయులపై కొత్త వెలుగులు



కోదాడలోని ముస్లిం శ్మశానవాటికలో లభించిన తొమ్మిది గుత్తుల రాగిపలకల మీద రాసివున్న శాసనాల ఆధారంగా కాకతీయ వంశావళిని తిరగరాయాల్సిన అవసరం ఉంది. ఆ శాసనప్రతులింకా వెల్లడి కాలేదు కానీ, వాటిలోని విశేషాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారాను, గత నెల 27న జూమ్ మీటింగులో ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారాను మైసూరులోని ఏఎస్సై శాసనాధ్యయన శాఖ డైరెక్టరు కె.మునిరత్నంరెడ్డి వెల్లడించారు. వాటి ద్వారా తెలిసిన శాసనాంశాలను యథార్థమని అంగీకరిస్తే... కాకతీయుల వంశావళిని తిరిగి రాయవలసి వస్తుంది.కోదాడ మొదటి రాగిశాసనంలో పేర్కొన్నట్టుగా విగ్రహవెట్టి, సకలశ్రీ, గుండ -1, ఎఱ్ఱ, అతని కుమారులు గుండ - 2, బేతియ, గోనకలు - ఇది తొలి కాకతీయుల వరుస. తర్వాత కాకతీయ వంశక్రమం కాకర్త్య గుండన నుంచి మారలేదు ఇప్పటివరకు. కోదాడ తొలి రాగిశాసనం 'విగ్రహవెట్టి' అని పేర్కొంటే, మాంగల్లు శాసనం 'సామంతవొద్ది సంజ్ఞామ్' అంటున్నది. 'సామంతవిష్టి' అని 2వ బేత(1090) కాజీపేట దర్గా శాసనం కూడా చెప్తున్నది. వెట్టి, వొద్ది, విష్టి సమానార్థకాలు. విష్టి (వెట్టి) వంశం కాదు, అదొక అధికార పదవి. విష్టి అనే పదం రాష్ట్రకూట రాజప్రతినిధి 'శంకరగండరస'కు కూడా ఉంది. వెట్టి చేయించే అధికారులే సామంతవెట్టి.విష్టి పన్ను వసూలు చేసే రాష్ట్రకూట పాలనా యంత్రాంగం ఉన్నతాధికారులు తమ కుటుంబాలను 'విష్టి' పేరుతో పిల్చుకున్నారు. (ఐఏపీ, వరంగల్: ఆకునూరు శాసనంలో విట్టి నారాయణ, 38) 'విష్టి' విధానం వాకాటక, రాష్ట్రకూట, చాళుక్య శాసనాల ద్వారా తెలుస్తున్నది. ఒకప్పుడు రాజులకు మాత్రమే 'విష్టి' చేయించే అధికారం కాలక్రమేణా సామంతులు, అధికారులు, భూస్వాములు, మంత్రులకు లభించింది. కాకర్తి గ్రామ నామం 2, 3వ కోదాడ రాగిశాసనాల్లో పేర్కొన్నారు. ఆ గ్రామంలో సకలశ్రీ పేరు మీద సకలేశ్వరాలయం, గుండ - 1 పేరు మీద గుండేశ్వర భట్టారకాలయం నిర్మితమైనట్టు ఆ శాసనాల వల్ల తెలుస్తున్నది. కాకర్తి ఎక్కడుందో తేలలేదు. మునిరత్నం జూమ్ మీటింగు వల్ల తెలిసిన వివరాలను బట్టి కోదాడ రాగి శాసనాల్లో పేర్కొన్న దానగ్రామాలు 12 (౦4 మధిర గ్రామాలు), వాటి సరిహద్దు గ్రామాలు 77. ఇవి ఎక్కడున్నాయో వెతికిపట్టుకుంటే కొండపల్లి విషయంలో ఏయే గ్రామాలెక్కడున్నాయో తెలుస్తుంది. కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశీలనలో కొన్ని సరిహద్దు గ్రామాలు యాతవాకిళ్ల, ఘట్టికల్లు, కుడకుడ, లోచెరువులు, మూసీనది సూర్యాపేట జిల్లాలోనూ, అలాగే పాలేరు, జువ్విపాడు (జూపెడ) ఖమ్మం జిల్లాలో ఉన్నట్లు తెలిసింది. మిగతా గ్రామాలు ఈ పరిసరాల్లోనే గుర్తించే అవకాశముంది.ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర - సంస్కృతి సంపుటాలలో 'మధ్యయుగ ఆంధ్రదేశం' (క్రీ.శ. 1000%-%1324) సంపుటి, పే.108లో నల్గొండ జిల్లా 2వ శాసనసంపుటి, శా.సం.25 క్రీ.శ. 1149నాటి శాసనంలో ఉన్న కొండపల్లి నాడు నేలకొండపల్లి మండలం కూడి ఉన్నటువంటిది. ఈ విభాగం కందూరుచోడుల సిరికొండ రాజ్యంలో భాగంగా ఉండేదని తెలుస్తోంది. అంటే ఈ కొండపల్లి విజయవాడ సమీపంలోని కొండపల్లి కోట కాదనేది విస్పష్టం. కాకతీయుల తొలి నివాసం తెలంగాణలోనే ఉందని చెప్పవచ్చు. కాకతీయుల శాసనాలన్నింటిలోను పేర్కొన్న కాకతిపురం హన్మకొండనే... అందులో విభేదమవసరం లేదు. తొలినాళ్ళ కాకర్తి ఏదన్నది వెతికితే సరిపోతుంది.పోతే దుర్జయుడు కాకతీయుల మూలపురుషుడా? దుర్జయుడనే పురాణపురుషుడు భాగవత పురాణాన్ని బట్టి మాంధాత కుడితొడ నుంచి పుట్టినవాడు. దుర్జయ నామం వంశమూలకంగా చెప్పుకుంటున్నవారు అతని వంశపారంపర్యంగా వచ్చిన పాలకులు కాదు. దుర్జయుడు తీరాంధ్రప్రాంతాల పాలకులందరికీ వంశకర్తగా చెప్పుకున్న శాసనాలెన్నో ఉన్నాయి. ఏ దుర్జయుడు? 2వ బేతరాజుకు శైవదీక్షనిచ్చిన గురువులు రాసిన శాసనంలో 'దుర్జయ' నామం వచ్చింది. రెండవసారి మైలమ గురువు ధర్మశంభు రాయించిన బయ్యారం శాసనంలో మళ్ళీ 'దుర్జయ' నామం కనిపించింది. కొలనుపాక శాసనంలో ఇంకొకసారి దుర్జయుని పేరొస్తుంది. మధ్యలో ఎవరి శాసనాల్లోనూ దుర్జయవంశం అని చెప్పుకున్న దాఖలాలు లేవు. దుర్జయుని పేరు కాకతీయులకున్న ప్రశస్తుల్లో అతిశయంగా చెప్పబడ్డదే తప్ప నిజంగా వంశం పేరు కాదనిపిస్తున్నది.వెన్ననృపుడని చెప్పింది బయ్యారం శాసనం. అది వేయించింది మైలమాంబ. అంతకు ముందు శాసనాలలో వెన్నరాజు పేరెందుకు లేదు? గూడూరు శాసనంలో 'బొఱంటి వెన్నడను సంభవుడయ్యె' అని ఉంది. అతనిని ఎఱ్ఱభూపతి కొడుకుగా పేర్కొన్నారు. ఆధార శాసనాలేవీ అంతకుముందు బయటపడలేదు. ఇప్పుడు కోదాడ శాసనాలు పేర్కొన్న విగ్రహవెట్టే వెన్నడుగా చెప్పబడ్డాడేమో. అయితే అతని కొడుకు ఎఱ్ర కాదు సకలశ్రీ, అతని కొడుకు 1వ గుండ అని కొత్త శాసనాలు వెల్లడిస్తున్నాయి. ఊహలెపుడు చరిత్రను నిర్మించలేవు. తేల్చిన ఆధారాలతోనే చరిత్ర మళ్ళీ రాసుకోవాలి. తామెపుడో చెప్పిన సంగతులకే విధేయంగా ఉండనవసరం లేదు. కొత్త చరిత్ర తెలిసినపుడు పాత చరిత్రను తిరిగి రాసుకోవడం చరిత్రకారుల కనీస బాధ్యత.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి** - ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు విచారించారు. ఈ సందర్భంగా పవన్‌తో కాసేపు మాట్లాడిన చంద్రబాబు, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్ ప్రస్తుతం పూర్తి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు అవసరమైన చికిత్స కొనసాగుతోందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన అధినేత ఆరోగ్యంపై ముఖ్యమంత్రి స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించడం, వారి మధ్య ఉన్న వ్యక్తిగత ఆత్మీయతను, పొత్తు ధర్మాన్ని తెలియజేస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## తెలంగాణ గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి** - సుమారు 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసిన కమిషన్, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా తుది మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ పరీక్షల్లో 600 మార్కులకు గాను అత్యధికంగా 447.08 మార్కులు నమోదైనట్లు కమిషన్ వెల్లడించింది.ఈ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-2, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి దసరా పండుగకు ముందే నియామక పత్రాలు అందజేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.ఫలితాల విడుదలపై టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పరీక్షలు నిర్వహించిన 10 నెలల వ్యవధిలోనే తుది ఫలితాలు ఇచ్చామని, గ్రూప్-1 వివాదం లేకపోయి ఉంటే ఫలితాలు మరింత తొందరగా వచ్చేవని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కట్-ఆఫ్ మార్కుల వివరాలు అధికారిక వెబ్‌సైట్ `tspsc.gov.in`లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్‌తో ఫలితాలను చూసుకోవచ్చని కమిషన్ సూచించింది.

## శాంతించిన మూసీ..ఎంజీబీఎస్‌లో బురద తొలగింపు పనులు వేగవంతం



**మొదటిపేజీ తరువాయి** - బస్ స్టేషన్ ప్రాంగణంలో భారీగా బురద పేరుకుపోయింది. దీంతో ఆర్టీసీ అధికారులు పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశారు.ముఖ్యంగా ఎంజీబీఎస్‌కు వచ్చే దారిలోని శివాజీ బ్రిడ్జి వద్ద, బస్ స్టేషన్‌లోని 56, 58, 60 నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద బురద పేరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, ఆర్టీసీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన శుభ్రపరిచే పనులను చేపట్టారు. బురదను పూర్తిగా తొలగించిన తర్వాత ఈరోజు మధ్యాహ్నం నుంచి బస్సులను తిరిగి ఎంజీబీఎస్‌లోకి అనుమతించే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతానికి జిల్లాలకు వెళ్లే బస్సు సర్వీసులను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి నడుపుతున్నారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, జేబీఎస్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పికప్ పాయింట్లకు చేరుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు కూడా ఈ తాత్కాలిక పికప్ పాయింట్ల నుంచే బస్సులు ఎక్కాలని స్పష్టం చేశారు.

# ప్రజలకు నాయకులు, కార్యకర్తలు దగ్గరగా ఉండాలి




**మొదటిపేజీ తరువాయి** - రంగాన్ని గాడిన పెట్టడంతో పాటు అనేక సమస్యలను పరిష్కరించామని వెల్లడించారు. నేడు తక్కువ ధరకే విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామన్నారు. పార్టీ కార్యకర్తలైనా, నాయకులైనా ప్రజలకు ఎప్పుడూ దగ్గరగా ఉంటూ మంచి చెడులను వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్తానంటే ప్రజలు హర్షించరని హితవు పలికారు. 11 మంది వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా, అదే పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు మాత్రం సభకు రావటం ఏం ద్వంద్వ వైఖరి డ్రామా అని చంద్రబాబు నిలదీశారు. సూపర్ సిక్స్ సహా అనేక మేనిఫెస్టో హామీలను నెరవేర్చామని గుర్తు చేశారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని, దేశంలో ఇదొక నూతన అధ్యాయమని కొనియాడారు. జీఎస్టీ సంస్కరణలతో ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలని సూచించారు. కనీసం రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల సమావేశాలు పెట్టి ప్రజలకు వివరించాలన్నారు. కూటమి పార్టీలు ఉమ్మడిగా జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారాన్ని నిర్వహించాలని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. పారిశ్రామిక, ఆటో మొబైల్, ఫార్మా, వంటి కంపెనీలకు జీఎస్టీ సంస్కరణలతో మేలు జరుగుతుందని వివరించారు.టూ వీలర్, ఏసీలు, కార్లు వంటి ఇంటి వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువుల రేటు తగ్గాయని, రోగులు వాడే మందులపై జీఎస్టీ లేదన్నారు. ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని గుర్తు చేశారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు 8 వేల కోట్ల మేర లబ్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గినా సంస్కరణల వల్ల ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారని అభిప్రాయపడ్డారు. సుపరిపాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ఏం చేశామో వివరించామని, అదే తరహాలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యకర్తల భాగస్వామ్యంతో యోగా డే సక్సెస్ అయిందని, ఇప్పుడు జీఎస్టీ ఉత్సవ్?ను సక్సెస్ చేయాలని కోరారు. తెలుగుదేశం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

# 2027 నాటికి దేశంలోనే నెంబర్ వన్ టూరిజం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతాం



**మొదటిపేజీ తరువాయి** - ఆ సేద తీరుడు వారికి పునరుత్తేజాన్ని ఇస్తుందని ఆయన అన్నారు.సహజసిద్ధ వనరులు, ప్రకృతి సౌందర్యం, వైవిధ్యమైన సంస్కృతి, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల మేళవింపుతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకులకు ఓ స్వర్గధామంగా నిలవగలదని, దీనికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి ప్రతి పౌరుడూ బ్రాండ్ అంబాసిడర్ కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీ కార్వాన్ టూరిజం బస్సులను మంత్రి కందుల దుర్గేష్, చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటకశాఖ అధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలిలతో కలిసి పరిశీలించారు. బస్సులోని సౌకర్యాలు, వసతులు తెలుసుకున్నారు. కేరళ బోట్ ఆపరేటర్లతో ముఖాముఖీ మాట్లాడారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అతిథ్య రంగంలో ప్రతిభ చూపిన వారికి టూరిజం ఎక్స్‌లెన్సీ అవార్డులు అందజేశారు."అతిథి దేవో భవ" మన విధానమని, ఆత్మీయతను పంచుతూ, మన ఆహార రుచులు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశేషాలు పర్యాటక అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్లుగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గతంలో పర్యాటకం అంటే కేవలం దేవాలయాల పర్యటన మాత్రమేనని, కానీ ఇప్పుడు అది దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే కీలక రంగమని గుర్తు చేశారు. అమెరికాలో పర్యాటక రంగం ద్వారా 2.6 ట్రిలియన్ డాలర్ల ఆదాయం వస్తోందని, భారతదేశంలోనూ విస్తారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. లక్ష రూపాయల పర్యటనలో ఖర్చు చేస్తే వేల మందికి ఉపాధి కల్పించవచ్చని ఆయన అన్నారు.తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించామని, పర్యాటకం ద్వారా భారీ ఆదాయం, ఉపాధి, ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. "ప్రస్తుతం నిలిచేది ఒక్క ఇజం - అది టూరిజమే" అని చంద్రబాబు స్పష్టం చేశారు.గత 15 నెలల్లోనే రాష్ట్రంలో రూ.10,600 కోట్ల పెట్టుబడులు పర్యాటక రంగంలో ప్రవేశించాయని సీఎం తెలిపారు. రాబోయే మూడేళ్లలో 50 వేల హోటల్ గదులు, 10 వేల హోం స్టేలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాల ఆధారంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తిరుమల, అన్నవరం వంటి ప్రాంతాల్లో వెడ్డింగ్ డెస్టినేషన్లు, బౌద్ధ కేంద్రాల్లో కుంభమేళా తరహా ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. విజయవాడ దసరా ఉత్సవాలను మైసూరు, కోల్?కతా స్థాయిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అమెరికా గ్రాండ్ కానియన్ తరహాలో గండికోట మనకు ఉందని, గుజరాత్‌లోని కచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసినట్టు ఆంధ్రలోనూ అనేక ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వం మాత్రమే ఖర్చు చేస్తే పురోగతి సాధ్యం కాదని, అందుకే పీపీపీ మోడల్లో 70 సాహస పర్యాటక ప్రాజెక్టులు త్వరలో అనుమతిస్తామని తెలిపారు.2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి టూరిజం హబ్?గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, రుషికొండలో భవనాలను కూల్చి రూ.450 కోట్లతో ప్యాలెస్ నిర్మాణం ద్వారా ప్రజా ధనం వృథా చేశారని అన్నారు. చంద్రగిరి కోట లైటింగ్, ప్రకాశం బ్యారేజ్ లైటింగ్ వంటి సౌకర్యాలను కూడా నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. సాంకేతికతను పర్యాటకానికి జోడిస్తే అద్భుత ఫలితాలు సాధ్యమని తెలిపారు.మండువా లోగిళ్లు, పురాతన ఆలయాలు, నదీ తీరాలు, కొండలు, సముద్రతీరాలు వంటి అనేక పర్యాటక ప్రదేశాలు రాష్ట్రంలో ఉన్నాయని, ప్రతి ప్రాంతానికీ ప్రత్యేకమైన వంటకాల రుచులు ఉన్నాయని, వీటిని పర్యాటక థీమ్ ప్రాజెక్టులుగా మార్చవచ్చని సూచించారు. కేంద్ర సహకారంతో అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్, అన్నవరం, అహోబిలం, సింహాచలం, బొర్రా గుహలు, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం పాలసీ ఆపరేషన్ గైడ్‌లైన్స్ను విడుదల చేసిన సీఎం, బాపట్ల గోల్డెన్ శాండ్ బీచ్ను వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే ఏపీ టూరిజం హోమ్‌స్టే పోర్టల్ను ఆవిష్కరించి, అరకు, విశాఖ, కోనసీమ హోమ్ స్టే యజమానులతో వర్చువల్‌గా సంభాషించారు.

## నాకు పదేళ్ల సమయం ఇవ్వండి, న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా



**మొదటిపేజీ తరువాయి** - సూచించారు. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలన్నారు.'ఎన్నాళ్లు ఇలా న్యూయార్క్, సింగపూం, దుబాయి గురించి చెప్పుకుంటాం. చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా నిర్మాణాలు ఉన్నాయని చెబుతుంటారు. ఎన్నాళ్లు విదేశాల గురించి చెప్పుకుంటాం. మనం కూడా అలా తయారు కావాలి కదా? నాకు పదేళ్లు సమయం ఇవ్వండి న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా. 70 ఏళ్ల నుంచి విదేశాల గురించే చెప్పుకుంటున్నాం. 70 ఏళ్ల తర్వాత కూడా మన గురించి ప్రపంచం మాట్లాడుకునే పనులు చేయొద్దా. అభివృద్ధి పనుల వల్ల కొందరికి ఇబ్బందులు కలగవచ్చు. వాటి వల్ల నష్టపోయేవారిని అన్ని విధాలా ఆదుకుంటాం.' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ** : దక్షిణ భారతంలో పోర్టులేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే, అందుకే అమరావతితో ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీకి ఏం తక్కువ అన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకే ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నానికి 12 లేన్ల రోడ్డు వేయబోతున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నైకి బుల్లెట్ ట్రైన్ వయా అమరావతికి కేంద్రం ఒప్పుకుందని హర్షించారు.ఫ్యూచర్ సిటీలో 500 ఫార్చ్యూన్ కంపెనీలు : ఫ్యూచర్ సిటీలో 500 ఫార్చ్యూన్ కంపెనీలు కొలువు తీరాలన్నది తన కల అని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 80 ఫార్చ్యూన్ కంపెనీలే ఉన్నాయని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటామన్నారు. చిన్నచిన్న విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడొద్దని హితవు పలికారు. ఎలాంటి సమస్య ఉన్నా నేను పరిష్కరిస్తా, దీని కోసం ఓ మెకానిజం ఏర్పాటు చేస్తామన్నారు."మీ భూములను గుంజుకునే ఆలోచన నాకు లేదు. ఏదైనా సమస్య ఉంటే కోర్టు బయట మాట్లాడుకుని తేల్చుకుందాం. కోర్టులకు వెళ్తే చట్ట ప్రకారం నష్టపరిహారం వస్తుంది. కోర్టు బయట మాట్లాడుకుంటే అంతకన్నా ఎక్కువ రావచ్చు. సింగరేణి కార్యాలయం ఇక్కడ నిర్మించండి. సింగరేణికి ప్రధాన కార్యాలయానికి 10 ఎకరాలు కేటాయిస్తున్నాం. ఏడాదిలోగా సింగరేణి ఆఫీసు ఫ్యూచర్ సిటీలో నిర్మించాలని శ్రీధర్‌బాబును కోరుతున్నాను. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెట్ అథారిటీని డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. ఎఫ్‌సీడీఏ, స్కిల్ వర్సిటీలను డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలు ఎఫ్‌సీడీఏ నుంచే చేపడతా." మీర్‌ఖాన్‌పేటలో 2.11 ఎకరాల్లో ఎఫ్‌సీడీఏ భవన నిర్మాణం జరగనుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేలను కలుపుతూ కొత్త ఈస్ట్?-వెస్ట్ ట్రంక్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. 7 మండలాలు, 56 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీ విస్తరణ అనేది జరగనుంది. ఈ ప్రాజెక్టులో ప్రపంచ బ్యాంకు, జపాన్ సంస్థల భాగస్వామ్యంతో నిర్మాణం చేయనున్నారు. నెట్?-జీరో స్మార్ట్ సిటీగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఓఆర్ఆర్?, ఆర్ఆర్ఆర్ కలుపుతూ వందమీటర్ల వెడల్పుతో గ్రీన్?ఫీల్డ్ రేడియల్ రోడ్లు నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

# తొక్కిసలాట ఘటనపై హైకోర్టుకు టీవీకే



**మొదటిపేజీ తరువాయి** - తమిళనాడులో కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ తమిళగ వెట్రి కళగం పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ ఘటనలో కుట్ర కోణం ఉందని ఆరోపించింది. మరోవైపు టీవీకే అధినేత విజయ్ ఇంటి వద్ద భారీ భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 40కు చేరింది. శనివారం విజయ్ నిర్వహించిన ర్యాలీలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడం, పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగినట్లు టీవీకే పేర్కొంది. ఈ ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరనున్నట్లు టీవీకే న్యాయవాది ఎస్ అరివళగన్ చెప్పారు. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు స్థానిక ప్రజల నుంచి తమకు విశ్వసనీయ సమాచారం ఉందని తెలిపారు. దీనికి సంబంధించి కొన్ని సీసీటీవీ దృశ్యాలు కూడా ఉన్నట్లు తెలిపారు. ర్యాలీలో నిబంధనలను ఉల్లంఘించారంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను అరివళగన్ తోసిపుచ్చారు. గత రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా, ఎక్కడా ఇలాంటి ఘటనలు జరగలేదని పేర్కొన్నారు. కానీ, కరూర్‌లోనే తొక్కిసలాట జరగడంపై సందేహాలు ఉన్నట్లు చెప్పారు.అయితే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దండపాణి నివాసానికి వెళ్లి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అభ్యర్థనను అంగీకరిస్తూ సోమవారం(సెప్టెంబర్ 29) మధ్యాహ్నం 2:15 గంటలకు హైకోర్టులోని మధురై బెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని తెలిపారు. టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ కూడా ఇదే విషయాన్ని మీడియాకు తెలియజేశారు. అధికారికంగా ప్రకటిస్తామని కూడా తెలిపారు.

**విజయ్ ఇంటి వద్ద అదనపు భద్రత**

తొక్కిసలాట తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు నీలంకరాయ్‌లోని విజయ్ ఇంటి వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 20మంది సీఆర్‌పీఎఫ్ పోలీసలను మోహరించారు. కేంద్రం ఇప్పటికే విజయ్?కు వై కేటగిరీ భద్రతను కల్పిస్తోంది. విజయ్ ఇంటి దగ్గర రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయగా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలో 20 మందికి పైగా పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన ఇంటి చుట్టూ అదనపు పోలీసు అధికారులను మోహరించారు. విజయ్ ఇల్లు ఉన్న ప్రాంతానికి అనుమానాస్పదంగా ఎవరైనా వస్తే వారిని ప్రశ్నించాలని పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, విజయ్ ఇంటికి అదనపు భద్రత కల్పించడానికి, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాయుధ సీఆర్?పీఎఫ్ పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు.

**40కు చేరిన మృతుల సంఖ్య**

ఇదిలా ఉండగా తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య 40కి పెరిగింది. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన క్షతగాత్రులకు చికిత్స అందుతోంది. శవపరీక్షలు పూర్తైన మృతదేహాలను వారి బంధువులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 30 భౌతిక కాయాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో 26మంది డిశ్చార్జ్ కాగా మరో 67 మంది వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సెంథిల్ కుమార్ వివరించారు. వారిలో ఒకరిని మధురై వైద్య కళాశాలకు తరలించినట్లు చెప్పారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సోమవారం 29- 09 - 2025

## నియోజవర్గ ప్రజలందరికీ సద్దులబతుకమ్మ శుభాకాంక్షలు...

-ప్రణవ్..

- పూలను,ప్రకృతిని దైవంగా భావించే గొప్ప పండుగ బతుకమ్మ.
- మానవ జీవన విధానానికి ఈ పండుగ నిదర్శనం.



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 29 :** పూలను దైవంగా భావిస్తూ ప్రకృతిని కాపాడుతూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఎంగిలిపూలతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు తీరొక్క పువ్వులను పూజిస్తూ జరుపుకుంటారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని ఇక్కడ జరుపుకునే బతుకమ్మ పండుగ చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంట్లో ఆనందంగా జరుపుకుంటారని అన్నారు.ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని,ప్రతి ఒక్కరూ ఆనందంగా,ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## శాలిగౌరారం లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**శాలిగౌరారం సెప్టెంబర్ 28, తెలంగాణసేన :** శాలిగౌరారం మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి హైస్కూల్ లో 2002-03 సంవత్సరం లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తరువాత కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆదివారం శాలిగౌరారం లోని సిఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఎంతో ఉత్సాహంగా గురువులను ఆహ్వానించి అపూర్వంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.వివిధ ప్రాంతాల్లో స్థిరపడి చాలా రోజుల తరువాత వారు కలుసుకోవడం తో వారి ఆనందానికి అవధులు లేవు.. ఒకరనినొకరు ఆప్యాయతగా పలకరించుకొని చిన్న నాటి మనోభావాలను,జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఆత్మీయ సమ్మేళన సమావేశం గురువులను ఘనంగా శాలువాల తో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమం లో హెచ్ ఎం బుడిగె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కొయ్యడ శివశంకర్, పడాల అంతయ్య, కొడవటికంటి సుబ్రమణ్య శర్మ, మద్ది శశిధర్ రెడ్డి,ఆకుల కృష్ణ,చెవుగోని సత్యనారాయణ,యేశబోయిన అంజయ్య,వేముల సోమయ్య,పులిజాల శ్రీనివాస్ రావు,ఖాజా మోహినుద్దీన్,గంట శోభ, మద్ది అరుణ,పూర్వ విద్యార్థులు కల్లూరి పరమేష్, జమ్ము నర్సింహా, సిరందాస్ మల్లిఖార్జున్, మిర్యాల శివప్రసాద్, బొడ్డు నాగరాజు, పంపాటి నాగరాజు, షేక్ హైమత్, ఇప్పలపల్లి నాగరాజు,రాధిక, సంతోషి,పాల్గొన్నారు.

## నిరాశ్రయులు, సంచార జాతుల వారి కోసం 285వ అన్నదాన కార్యక్రమము





**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్: :** హైదరాబాద్ నగరంలో వాహనంలో సంచరిస్తూ వివిధ ప్రాంతాలలో ఫుట్ పాత్ల మీద ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి 285వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాము. ఈ అన్నదాన కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ, సేవాసభ్యులు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను కుటుంబ సభ్యులను పరామర్శించిన బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు సుధా బాల్ రెడ్డి




**తెలంగాణ సేన మిడ్జిల్ న్యూస్:** మిడ్జిల్ మండల మిడ్జిల్ మండల బి.ఆర్.ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు మంద భీమ్ రాజ్ గారి తండ్రి మంద లాలయ్య గారు గత కొన్ని రోజులకు క్రితం అనారోగ్యంతో మృతి చెందగా నిన్న వారి కుటుంబ సభ్యులను టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సుధా బాల్ రెడ్డి గారు పరామర్శించి మనోధైర్యాన్ని తెలియజేయడం జరిగింది వారితోపాటు బీఆర్ఎస్ పార్టీ మిడ్జిల్ అధ్యక్షులు బెహిని పాండు. మాజీ ఏఎంసి డైరెక్టర్ వీరారెడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గంజి శేఖర్ భాస్కర్ చారి బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్న ఆంజనేయులు గ్రామ ముఖ్య నాయకులు లింగం గౌడ్ శేఖర్ గౌడ్ నరేష్ పెద్ద నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

**తెలంగాణ సేన న్యూస్ మిడ్జిల్:** రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు బొలెరో వాహనం తగలడంతో లో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది . స్థానికుల కథనం ప్రకారం వెలుగొమ్ముల గ్రామానికి చెందిన బుద్ధారం రామస్వామి మిడ్జిల్ సొంత పనుల కోసం వచ్చారు. వెల్జాల్ రోడ్డు సమీపంలో రోడ్డు దాటునంగా ప్రమాదవశాత్తు బొల్లోరా వాహనం ఢీకొంటడంతో తీవ్రంగా గాయపడ్డారు తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తుంది గాయపడ్డ రామస్వామిని స్థానికులు సహాయంతో 108 లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు .

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానించిన ఏనుగు మనోహర్ రెడ్డి...



**వేములవాడ,సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన):** వేములవాడ కోర్టు అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన గుడిసె సదానందను బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గారు సన్మానించడం జరిగింది, వీరి వెంట మాజీ సర్పంచ్ మ్యకల శ్రీనివాస్, గుడిసె అనిల్, అయిత వెంకన్న, సంతోష్ రెడ్డి,వనపర్తి పర్శరాములు,జనార్ధన్ రెడ్డి,మోహన్ రెడ్డి,రాజి రెడ్డి, వికృర్తి సాయి, కొమురయ్య, రామచంద్రం, మహేందర్, మనోజ్, జగదీష్, వెంకటేష్,స్వామిరెడ్డి,బండి అనిల్, తదితరులు పాల్గొన్నారు..

## కేంద్రమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు...



**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్ కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి స్థానిక పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేసి దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలని వారు వేడుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా పండగలను జరుపుకోవాలని కోరుకున్నారు. అనంతరం సంటి మహేష్ ను కేంద్ర మంత్రి కండువా కప్పి అభినందించారు. రాబోయే దసరా వేడుకలను ప్రశాంతంగా జరిగే విధంగా స్థానిక బిజెపి శ్రేణులు వేడుకలను నిరంతరం పర్యవేక్షించాలని కేంద్ర మంత్రి వారికీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ప్రముఖ సాహితీవేత్త అవధానుల దత్తయ్య శర్మ కన్నుమూత



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది సెప్టెంబర్ 28 :** ప్రఖ్యాత సాహితీవేత్త,అవధాని అయిన అవధానుల దత్తయ్య శర్మ శివైక్యం చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం కరీంనగర్లోని అపోలో రిచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దత్తయ్య ఆకస్మిక మరణ వార్త హుజురాబాద్ ప్రాంత సాహితీ లోకాన్ని, ఆయన అభిమానులను, ఆప్తులను, కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో నెట్టివేసింది. తెలుగు భాషకు, సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అపారమని, ఆయన మరణం తీరని లోటని పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.తన జీవితాన్ని అవధాన కళకు, సాహిత్య లోకానికి అంకితం చేశారు. తనదైన శైలిలో పద్య రచన, ప్రసంగ ధోరణితో ఎంతో మందిని ఆకట్టుకున్నారు. ఆయన చేపట్టిన ఎన్నో అవధానాలు, సభలు, ప్రసంగాలు హుజురాబాద్ ప్రాంతానికి స్ఫూర్తినిచ్చాయి. ఆయన బహుముఖ ప్రజ్ఞ, విజ్ఞానం ఎందరికో ఆదర్శం. సాహిత్య రంగంలో ఆయన చేసిన కృషికి పలు సన్మానాలు లభించాయి. దత్తయ్య శర్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన అభిమానులు, శిష్యులు తమ దుఃఖాన్ని తెలియజేస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు ఈ తీరని శోకాన్ని తట్టుకునే మనో ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ ప్రార్థిస్తున్నారు.

## భీమేశ్వరాలయం లో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...



**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ సమయం లో భక్తులకు స్వామి వారి దర్శన సౌభాగ్యం భీమేశ్వరాలయంలో అందించాలనే ఉద్దేశం తో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వ విప్ మరియు వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ భీమేశ్వర ఆలయం, వీఐపీ రోడ్, పార్కింగ్ స్థలాలు మరియు ఇతర ప్రాంతాలను సమీక్షించి, అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. శ్రీ ఆది శ్రీనివాస్ శ్రీ భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలు, షెడ్లు, శంకరమఠంలో నిర్మిస్తున్న అభిషేకం మరియు కళ్యాణ మండపాలు, క్యూలైన్లు, కౌంటర్లు మరియు ఇతర సౌకర్యాల గురించి అధికారులతో కూలంకషంగా చర్చించారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వేద పాఠశాల ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేస్తున్న వసతులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి, కార్యనిర్వాహక ఇంజనీర్ రాజేష్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు రఘునందన్, మహిపాల్ రెడ్డి, ఏఈఓ శ్రావణ్ కుమార్ మరియు తదితర ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయంలో చేపట్టిన పనులు మరింత వేగవంతం కానున్నాయని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అతి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

# వేములవాడలో ప్రభుత్వ విప్ కుమారుడి వినూత్న సేవా కార్యక్రమం

### శాలువలను గౌన్లుగా మలిచి నిరుపేద చిన్నారులకు పంపిణీ





**వేములవాడ,సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** వేములవాడ నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తీక్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. వివిధ సందర్భాల్లో ఆది శ్రీనివాస్‌కు వచ్చిన శాలువలను హెూనర్ హ్యూమానిటీ పేరుతో చిన్నారుల కోసం గౌన్లుగా కుట్టించి పంపిణీ చేయడం జరిగింది. వేములవాడ పట్టణంలోని పలు కాలనీలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆది శ్రీనివాస్ పాల్గొని గౌన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి వచ్చిన శాలువలను గౌన్లుగా మలిచి పంపిణీ చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. మా కుమారుడు ఆది కార్తీక్ ఆలోచనతోనే ఈ కార్యక్రమం చేపట్టామని, వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆది కార్తీక్‌ను అభినందిస్తున్నామని అన్నారు. గౌరవార్థం వచ్చిన శాలువలను సేవాభావంతో గౌన్లుగా మలిచి పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, వీటిని తయారు చేసే ప్రక్రియలో పలువురికి ఉపాధి లభిస్తోందని, శాలువలు ఉపయోగంలోకి రావడం పట్ల తృప్తి కలుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా ముందుకు తీసుకెళ్తామని, అన్నారు.

# రేణుక ఎల్లమ్మ దేవాలయం బోర్ వెల్ పూజా కార్యక్రమం...





**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** భారత జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారి ఎంపీ నిధులతో నేడు భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణం అధ్యక్షులు శ్రీ రాపల్లి శ్రీధర్ గారి ఆధ్వర్యంలో నాంపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ టెంపుల్ నూతన బోర్ వెల్ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డబోయిన గోపి హాజరయ్యారు ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా కేంద్రమంత్రి బండి సంజయ్ సారథ్యంలో ఈరోజు బోర్ వేయించడం జరిగిందని అన్నారు. జిల్లా అధ్యక్షులు గోపి మాట్లాడుతూ రాజకీయం అనేది ఎన్నికల వరకు మాత్రమే ఎన్నికల తదనంతరం అభివృద్ధిలో అన్ని పార్టీల వారితో కలిసి పనిచేస్తామని అన్నారు.వేములవాడ పట్టణానికి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ సంటి మహేష్ రేగుల రాజ్ కుమార్ పిన్నింటి హనుమాన్లు రేగుల సంతోష్ గుడిసె మనోజ్ మెరుగు లక్ష్మన్ మైలారం శ్రీను చిక్కుడు మల్లేశం జడల నరసయ్య చిలువేరి బాబు లాలా శేఖర్ బాలరాజు చిలువేరి పర్శరాములు చిలువేరి రాజు చిలువేరి సంతోస్ చిలువేరి పర్శరాములు పోషవేణి శ్రీనివాస్ గౌడ సంఘం కుల సభ్యులు బిజెపి నాయకులు బూత్ అధ్యక్షులు నాంపల్లి వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనార్థం నిన్నటి రోజున అంగరంగ వైభవంగా జరిగిన వేములవాడలో ఆడపడుచుల

### బతుకమ్మ సంబరంలు

### పూలవనంగా మారిన వేములవాడలోని ములవాగు బతుకమ్మ తెప్ప



**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి. మాజీ ఆలేరు ఎమ్మెల్యే గోగండి సునీత మాజీ జెడ్పీ ఛైర్మన్ లు తుల ఉమ,న్యాలకొండ అరుణ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు మహిళా నాయకురాలు పాల్గొన్నారు. వేములవాడలోని ములవాగు బతుకమ్మ తెప్ప వద్ద శనివారం ఘనంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్కపూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో బతుకమ్మ తెప్ప పూల వనాన్ని తలపించింది. తీరొక్క పూలతో తెలంగాణ సంప్రదాయానికి అద్దంపట్టేలా ములవాగు బతుకమ్మ తెప్ప వద్ద బతుకమ్మలు పెట్టి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు.బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇంత పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడడానికి వచ్చిన మహిళలకు పద్మ దేవేందర్ రెడ్డి గారు మహిళా నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం



**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** వేములవాడ పట్టణం లో జరిగిన విలేకరుల సమావేశం లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి. రాములు మాట్లాడుతూ గ్రామపంచాయతి కార్మికులకు 3నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయని, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వున్నాయి కాబట్టి కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని, ప్రతి కార్మికునికి సమాన పనికి సమాన వేతనం అన్న రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారంగా కనీసం వేతనం 26 వేలు ఇస్తూ, కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాదం భీమా సౌకర్యం 25లక్షలు ఇస్తూ, గ్రామాపంచాయతిలో వున్న ట్రాక్టర్లు, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించాలని, కార్మికులకు హెల్త్ కార్డు లు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ గ్రామపంచాయతీ కార్మిక సంగం జిల్లా కన్వీనర్ దుద్రపెల్లి. రవీందర్, ఈసరి. దేవన్న, దుద్రపెల్లి. లక్ష్మన్, మాన్వాడ. పరమేశ్వర్, కురుమ. గుండయ్య, నేరెళ్ల. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## హిందు వాహిని ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి



**ముధోల్,28సెప్టెంబర్(తెలంగాణ సేన న్యూస్):** మండల కేంద్రంలోని భగత్ సింగ్ చౌరస్తా వద్ద హిందు వాహిని ముక్తాపూర్ శాఖ ఆధ్వర్యంలో 118వ భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ..ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ భారత యువత గుండెల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి మహనీయులన్నారు., బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన విప్లవ వీరుడని అతి చిన్న వయసులో ప్రాణాల సైతం తృణప్రాయంగా దేశం కోసం త్యాగం చేసిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు భగవత్ సింగ్ అని కొనియాడారు. యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, నాయకులు తాటివార్ రమేష్,కోరి పోతన్న, లడ్డు పోతన్న, హిందు వాహిని కార్యకర్తలు రాంకీ,సాయి తో పాటు తదితరులు పాల్గొన్నారు

## దుర్గాదేవి వద్ద సామూహిక హోమం



**ముధోల్, 28 సెప్టెంబర్ (తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గాదేవి మండపాల వద్ద ఆయా యువజన సంఘాల ఆధ్వర్యంలో హెూమ కార్యక్రమాలను చేపట్టారు. మండల కేంద్రంలోని ఓం శ్రీ మహా శక్తి దుర్గామాత వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో వేద మంత్రచరణ మధ్య హెూమ కార్యక్రమాలను నిర్వహించారు.హెూమ కార్యక్రమంలో దంపతులు కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మ వారిని వేడుకున్నారు.

## ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు



**ముధోల్: 28 సెప్టెంబర్ (తెలంగాణ సేన న్యూస్) :** మండలంలోని రాంటెక్ గ్రామంలో భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ, భగత్ సింగ్ దేశ స్వాతంత్రం కోసం వీరోచిత పోరా టం చేసిన గొప్ప యోధుడన్నా రు.యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్. దేవేందర్, మల్లేష్, బి. సాయినాథ్, ఎం. సాయినాథ్, శివకుమార్, బాపురావు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పరాశక్తి దుర్గామాత వద్ద సామూహిక కుంకుమార్చన



**ముధోల్, 28 సెప్టెంబర్ (తెలంగాణసేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లోని దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పరాశక్తి దుర్గామాత వద్ద మహిళలు సామూహిక కుంకు మార్చన పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా వేద పండితులు ప్రణీత్ మహారాజ్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణాల మధ్య గణపతి, గౌరీ, కలశ, కుంకు మార్చన పూజలను నిర్వహింపజేశారు.కుంకుమార్చన పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేశారు.దీంతో అమ్మవారి దయతో గ్రామస్తులందరూ అష్టశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉంటూ పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతను వేడుకున్నారు. అనంతరం దుర్గ దేవి హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.పరాశక్తి దుర్గామాత వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి రద్దు

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** జిల్లాలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందనే వాతావరణ శాఖ సూచనలు, జిల్లాలోని పలు చోట్ల సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గమనించి ప్రజావాణికి రావద్దని సూచించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
సోమవారం 29 - 09 - 2025

# ఆడెల్లి గంగ నీళ్ళ జాతర ముగింపు ఉత్సవాన్ని పర్యవేక్షించి, పోచమ్మ తల్లి ఆభరణాలను సంప్రదాయం ప్రకారం ఎత్తుకున్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



**నిర్మల్:సెప్టెంబర్ 28:తెలంగాణ సేనన్యూస్ :** నిర్మల్ జిల్లా: అడెల్లి పోచమ్మ దేవస్థానంలో జరిగే గంగ నీళ్ళ జాతర భక్తుల ఉత్సాహం, పోలీసులు ఏర్పాటు చేసిన భద్రతా చర్యల నడుమ ప్రశాంతంగా ముగుస్తున్న తరుణంలో యాకర్పల్లి గ్రామంలో సంప్రదాయం ప్రకారం పోచమ్మ తల్లి ఆభరణాలను ఎత్తుకున్న జిల్లా ఎస్పీ డా .జి.జానకి షర్మిల ఐపీఎస్. మహాలయ అమావాస్య తదుపరి వచ్చే శని, ఆదివారాల్లో ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీ వస్తుంది. ఈ నెల 27న అడెల్లి గ్రామంలోని సేవాదారుల ఇంటి నుంచి అమ్మవారి ఆభరణాలు, వెండి కడవతో గోదావరికి పాదయాత్రగా పయనమవడంతో జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేలాది మంది భక్తులు అమ్మవారి ఆభరణాలను అనుకరిస్తూ అడెల్లి, సారంగాపూర్, యాకర్పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్పూర్ మండలంలోని కదిలి, మాటేగాం, దిలావర్పూర్, బన్సపెల్లి, కంజర్, సాంగ్వి నుంచి సాయంత్రం గోదావరి తీరానికి చేరుకుంటారు. అక్కడే రాత్రి జాగరణ చేసిన తిరిగి ఆదివారం వేకువజామున ఆభరణాలను పవిత్ర గోదావరిలో నీటితో శుద్ధి చేస్తారు. తిరిగి అవే గ్రామాల మీదుగా రాత్రికి అడెల్లి ఆలయానికి చేరుకొని ప్రత్యేక వెండి కడవలో తీసుకొచ్చి గోదావరి నీటిని స్థానిక కోనేటి నీటితో కలిపి అమ్మవారికి జలాభిషేకం చేస్తారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ప్రతీ ఏటా జరిగే ఈ జాతరకు నిర్మల్ జిల్లా ప్రాంతవాసులే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రాంత వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. గంగనీళ్ల జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా, శాంతి భద్రతల రక్షణ కోసం పోలీసులు భారీ బందోబస్తును సైతం ఏర్పాటు చేసారు .. సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో గల శ్రీ మహా పోచమ్మ అమ్మవారి గంగనీళ్ల జాతర వైభవంగా కొనసాగుతోంది. అమ్మవారి ఆభరణాలను యాకర్పల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల దర్శించుకుని, సాంప్రదాయ ప్రకారం స్వయంగా ఎత్తుకునీ 5 అడుగులు వేయడం జరిగింది. అమ్మవారు సారంగాపూర్ గ్రామంలో ఎంటర్ అయ్యే ముందు %ఛ్రా% ఆభరణాలు ఎత్తుకోవడం సంప్రదాయం గా వస్తుంది.జాతర సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో వారి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన గంగనీళ్ల జాతర ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు

## ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య!




**తెలంగాణసేన, శాయంపేట:** బీటెక్ పూర్తి చేసి రెండేళ్లయినా ఉద్యోగం రావడంలేదనే మన స్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా నర్సింహుల పల్లిలో జరిగింది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపల్లికి చెందిన రైతు ముసుకు మల్లయ్య కుమారుడు హరీశ్(26) రెండు సంవత్సరాల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో మనస్తాపానికి గురైన హరీశ్ ఈ నెల 24న సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకుని వరంగల్‌కు వెళ్లాడు. అకడి నుంచి తండ్రికి ఫోన్ చేసి ఉద్యోగం రాకపోవడంతో గడ్డి మందు తాగానని చెప్పాడు. వెంటనే తల్లిదండ్రులు వరంగల్‌కు వెళ్లి హరీశ్‌ను పరకాల దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పరమేశ్ తెలిపారు.

## గ్రూప్ -2 ఫలితాలు విడుదల

### 782 ఉద్యోగాలతో తుది జాబితా

### 18 రకాల ఉద్యోగాల భర్తీ

### దసరాలోపే నియామక పత్రాలు




**హైదరాబాద్, తెలంగాణసేన :** అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రూప్-2 తుది ఫలితాలు విడుదలయ్యాయి. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం ఈ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 783 పోస్టులకు 782 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు. మెడికల్ రిపోర్ట్ అందని కారణంగా ఒక పోస్టు భర్తీని విత్‌హెల్డ్‌లో ఉంచారు. గ్రూప్-2లో భాగంగా మొత్తం 18 రకాల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశారు. పూర్తి వివరాల కోసం %ఫ్ట్రజూం://ఞఞ్.ంజూంఎ.స్త్రశీజ.ఱఅ% వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, పరీక్షలు నిర్వహించిన 10 నెలల్లోనే ఫలితాలు వెల్లడించామని కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. విజేతలకు దసరాలోపే నియామకపత్రాలను అందజేయాలని సర్కారు వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే గ్రూప్-1 విజేతలకు నియామక పత్రాలను అందజేయగా, గ్రూప్ -2 విజేతలకు సైతం అక్టోబర్ 2న దసరాలోపే శాఖల వారీగా నియామక ప త్రాలిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**కేసీఆర్ హయాంలో**

గ్రూప్-2 పోస్టుల భర్తీకి గత కేసీఆర్ సర్కారు హయాంలోనే నోటిఫికేషన్ విడుదలైంది. 2022లో 783 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు పరీక్షలు వాయిదా పడ్డాయి. 2024 డిసెంబర్‌లో రాత పరీక్షలను నిర్వహించారు. 2025 మార్చిలో జనరల్ ర్యాకింగ్ లిస్టును విడుదల చేశారు. మొత్తం 5,51,855 మంది గ్రూప్-2కు దరఖాస్తు చేయగా, 2,49,964 మంది అభ్యర్థులు పరీక్షలను రాశారు. వారి లో 13,316 మందిని అనర్హులుగా ప్రకటించారు. 2,36,649 మంది అభ్యర్థులతో జనరల్ ర్యాంకింగ్ లిస్టును విడుదల చేశారు. ఆ తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించి, తాజాగా తుది ఫలితాలను విడుదల చేశారు.

## జీవితంలో చాలా తప్పులు చేశానంటూ..

### యువకుడి సెల్ఫీ సూసైడ్



**బంజారాహిల్స్, తెలంగాణసేన :** 'జీవితంలో చాలా తప్పులు చేశాను.. ఇలాంటి తప్పులు మళ్లీ చేయకుండా ఉండాలంటే ఆత్మహత్య ఒక్కటే మార్గం..' అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని ఓ యువకుడు ఆత్యహత్యకు పాల్పడ్డ ఘటన జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్‌కు చెందిన ఓ యువతి సీరియళ్లలో నటిస్తూ జూబ్లీహిల్స్‌లోని ప్రశాంత్‌నగర్‌లో బంధువుల ఫ్లాట్‌లో ఉంటోంది. ఆమెకు ఫిబ్రవరిలో సవాయ్ సింగ్(30) అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారడంతో జూలైలో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఈనెల 26న ఫ్లాట్‌లో ఉండే భార్యాభర్తలు ఫంక్షన్ కోసం పంజాబ్‌కు వెళ్లగా మరుసటిరోజు ఉదయాన్నే సవాయ్ సింగ్ యువతి ఫ్లాట్‌కు వచ్చాడు. ఇద్దరూ కలిసి కాఫీ తాగారు. ఉదయం 11గంటల సమయంలో యువతి ఆఫీస్‌కు వెళ్లగా తాను కూడా ఆఫీసుకు వెళ్తున్నానంటూ సవాయ్ సింగ్ బయటకు వెళ్లిపోయాడు. కాగా సాయంత్రం ఫ్లాట్‌కు వచ్చిన యువతి లోనికి వెళ్లిచూడగా డైనింగ్ హాల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సవాయ్‌సింగ్ కనిపించాడు. దీంతోషాక్‌కు గురైన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించగా ఉదయం బయటకు వెళ్లిన సవాయ్‌సింగ్ కాసేపటికి తిరిగి వచ్చి వెనకడోర్ నుంచి ఫ్లాట్‌లోకి ప్రవేశించి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తేలింది. కాగా చనిపోయేందుకు ముందు ఇన్‌స్టాగ్రామ్‌లో సవాయ్‌సింగ్ వీడియో పోస్ట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాను జీవితంలో అనేక తప్పులు చేశానని, మళ్లీమళ్లీ అలాంటి తప్పులు చేస్తూ జీవితం గడపలేనని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## గ్రూప్-1పై సుప్రీంకోర్టుకు వెళ్తాం

### రీ ఎగ్జామ్ పెట్టాలి


### తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం చేశారు

### ఓయూ జేఏసీ నేత మోతీలాల్



**ఖైరతాబాద్, తెలంగాణసేన :** గ్రూప్-1లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టుకు వెళ్తామని, మెయిన్స్ పేపర్లను రీవాల్యుయేషన్ చేయడం కాదని, రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఓయూ జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గ్రూప్-1అభ్యర్థులు గంగా భాస్కర్, రమావత్ మోహన్, రమ్య, ఝాన్సీతో కలిసి ఆయన మాట్లాడారు. యూపీఎస్సీని అనుసరిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలుచేయలేదని మండిపడ్డారు. రెండు హాల్‌టికెట్లు ఇవ్వడంతోనే టీజీపీఎస్సీ బండారం బయటపడిందని పేర్కొన్నారు. సింగిల్‌బెంచ్ తీర్పు వచ్చిన కొద్ది గంటల్లోనే నియామకాలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఆ తీర్పులో ఏమున్నది? తెలుగు మీడియం విద్యార్థుల గురించి ఏమైనా ప్రస్తావించారా? అనేది తేలాల్సి ఉన్నా, అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. 563 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసిన టీజీపీఎస్సీ వారి పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అడ్డదారిలో స్థానికేతరులు, అగ్రవర్ణాలకు కేటాయించిన విషయం వెలుగులోకి వస్తుందనే భయంతోనే ఆగమేఘాలపై నియామకపత్రాలు అందజేశారని పేర్కొన్నారు. తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో లక్ష్మి, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# దగ్గు, జలుబుతో అవస్థ పడుతున్నారా..? అయితే ఈ సహజసిద్ధమైన ఇంటి చిట్కాలను పాటించండి..!



దగ్గు, జలుబు అనేవి సీజన్లు మారినప్పుడల్లా మనకు వస్తూనే ఉంటాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సీజన్లు మారకున్నా తరచూ ఈ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటారు. వాతావరణంలో వచ్చే మార్పులతోపాటు కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా దగ్గు, జలుబు సమస్యలు మనల్ని అవస్థలకు గురి చేస్తుంటాయి. అయితే ఈ సమస్యలకు చాలా మంది ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. కానీ ఇంగ్లిష్ మెడిసిన్‌ను తరచూ వాడడం వల్ల దీర్ఘకాలంలో అనేక సమస్యలు వస్తాయి. అనేక సైడ్ ఎఫెక్ట్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీంతో పలు వ్యాధులు సైతం వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక ఇంగ్లిష్ మెడిసిన్‌ను ఎక్కువగా వాడకూడదు. మరి ఆయా సమస్యల నుంచి ఎలా బయట పడాలి అని చాలా మందికి సందేహం వస్తుంటుంది. కానీ అందుకు ఆయుర్వేదంలో చక్కని పరిష్కారాలు ఉన్నాయి. పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల ఆయా సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు. పైగా వాటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. ఇక ఆ ఇంటి చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**హెర్బల్ టీలు..**

దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నప్పుడు రోజూ 2 లేదా 3 సార్లు హెర్బల్ టీలను సేవిస్తుండాలి. అల్లం, తులసి, కమోమిల్, పెప్పర్‌మింట్ వంటి హెర్బల్ టీలు ఆయా సమస్యల నుంచి త్వరగా బయట పడేలా చేస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఇన్ ఫెక్షన్లను త్వరగా తగ్గిస్తాయి. దీంతో దగ్గు, జలుబుతోపాటు ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వేడి వేడి చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను తాగుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని వల్ల కఫం త్వరగా కరిగిపోతుంది. దగ్గు, జలుబు తగ్గుతాయి. ఇక ఈ సమస్యలను తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక టీస్పూన్ తేనెను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు 2 సార్లు లేదా 3 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. అవసరం అయితే అందులో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు.

**అల్లం, వెల్లుల్లి..**

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. వికారం నుంచి బయట పడేలా చేస్తాయి. వైరస్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అల్లంను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. లేదా నేరుగా ఒక టీస్పూన్ అల్లం రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 లేదా 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. ఇక వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇందుకు గాను 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని కాస్త నలిపి అందులో కాస్త తేనె కలిపి నేరుగా అలాగే తినేయాలి. లేదా వెల్లుల్లి రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే ఉపయోగం ఉంటుంది.

**పసుపు, మిరియాలు..**

పసుపు, మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడిలలో దేన్నయినా సరే పాలలో కలిపి తీసుకుంటే ఉపయోగం ఉంటుంది. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ పండ్లను తేనెతో కలిపి తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఇలా ఆయా ఇంటి చిట్కాలను పాటిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పైగా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

## శ్రీ సరస్వతి అమ్మవారి మూల నక్షత్ర కార్యక్రమానికి కట్టుదిట్టమైన బందోబస్తు

### బాసర గోదావరి నది స్నాన ఘట్టాల పరివాహక ప్రాంతాన్ని వరద ఉధృతిని సమీక్షించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ ఐపిఎస్



**బాసర, తెలంగాణసేన :** బాసరలో జరిగే శ్రీ శారదీయ శరన్నవరాత్రి మహోత్సవం సందర్భంగా, శ్రీ సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం అయిన మూల నక్షత్రంరోజున (29 సెప్టెంబర్ సోమవారం) తెల్లవారుజామున జరిగే మహా అక్షరాభ్యాస కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో వస్తారు కనుక విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ సపర్యవేక్షించడం జరిగింది.

## బహుజన బిడ్డల బతుకులతో ఆడుకోవద్దు

### బహుజన్ సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు తగరం సుభాష్




**మునుగోడు, తెలంగాణ సేన న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల గురించి అధికార యంత్రాంగం తమ ఇష్టానుసారంగా వార్డుల రిజర్వేషన్లు ప్రకటించిందని బహుజన్ సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షులు తగరం సుభాష్ అన్నారు. దీనిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీసీ జనాభా ఉన్నవార్డులో జనరల్ రిజర్వేషన్ పెట్టి స్థానిక సంస్థల్లో కూడా రెడ్డిలకు అధికారం ఉండాలని చేస్తుందన్నారు. ఇలా కాకుండా ఎస్సీ జనాభా ఉన్న వార్డులో ఎస్సీ రిజర్వేషన్ బీసీ జనాభాలో ఉన్న వాటిలో బీసీ రిజర్వేషన్ కేటాయించాలని అధికారుల్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్థానిక ఎన్నికల్లో సీట్ల చోరీ చేయడానికి కంకణం కట్టుకున్నాడని, ప్రజలారా ఇప్పటికైనా మళ్ళీ మోసపోకండి బహుజన బిడ్డల బతుకులతో ఆడుకోవద్దని ఆయన అన్నారు.

## మునుగోడు మండల కేంద్రంలో అతి తక్కువ ధరకి, రుచికరమైన బిర్యాని




**మునుగోడు, తెలంగాణ సేన న్యూస్:** నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో నూతనంగా పి ఎల్ ఎస్ బిర్యానీ సెంటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పి ఎల్ ఎస్ బిర్యానీ సెంటర్ అధినేత పందుల లింగస్వామి మాట్లాడుతూ, అతి తక్కువ ధరకి, రుచికరమైన బిర్యాని మునుగోడు మండల కేంద్రంలో ప్రతి రోజు అందుబాటులో ఉంటుందని, అదేవిధంగా ఆర్డర్లపై బిర్యాని సప్లై చేపడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండి అన్వర్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు, మాజీ ఉప సర్పంచ్ పందుల పవిత్ర – శ్రీను, పందుల సంపత్, కుమార్, ఎర్రబెల్లి శంకర్ రెడ్డి, అనంత సాయికుమార్, సునీల్, సులేమాన్, కట్టెల సుఖేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ షోలను నిషేదించాలి: రాజనాల శ్రీహరి




**వరంగల్, తెలంగాణ సేన న్యూస్:** తమిళనాడు రాష్ట్రంలో కరూర్ రోడ్ షోలో తొక్కిసులాటలో అమాయక ప్రజలు చిన్న పిల్లలతో సహా 39 మంది మరణించారని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు బహిరంగ సభలు రోడ్డు షోలు సినీ పరిశ్రమ బహిరంగ షోలు సభలు గానీ రోడ షోలు లు నిషేదించాలంటూ కేంద్ర హెూం శాఖకు, సుప్రీంకోర్టుకు కోరారు. ఈ రోడ్ షోల వల్ల ప్రజలకు వచ్చేది ఏమీ లేదు అని, ఇబ్బందులు తప్ప దీనివల్ల అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రాష్ట్ర పార్టీలకు, సినీ పరిశ్రమలకు తక్షణమే రోడ్ షోలు నిలిపివేయాలని రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

## బాపు చాయ్ దందా ఎలా నడుస్తుంది...

### టీ కొట్టు నిర్వాహకుడిని వివరాలు అడిగి తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ సేన) :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న క్రమంలో పక్కనే ఉన్నా టీ కొట్టు నిర్వాహకుడి వద్ద రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాసేపు ఆగి చాయ్ దందా ఎలా నడుస్తుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో నాయకులతో కలసి విప్ చాయ్ తాగారు.